www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 17 డిసెంబర్ 2023

నిధుల దుర్వినియోగంపై విచారించాలి : సిపిఎం

రాయచోటి టౌన్ : స్థానిక మాసాపేటలో ఉన్న మార్కెట్ యార్డు ప్రహరీ నిర్మాణానికి మంజూరైన రూ.70 లక్షల నిధుల దుర్వినియోగంపై సిటింగ్ జడ్జితో ప్రభుత్వం విచారణ చేయించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ. రామాంజులు డిమాండ్ చేశారు. శనివారం సిపిఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా మార్కెట్ యార్డ్ కాంపౌండ్ వాల్ స్థలానికి రూ. 70 లక్షలు మంజూరైనప్పటికీ ప్రహరీని నిర్మించలేదనారు. యార్డులోని గోడౌన్, రూములు ప్రయివేట్ వ్యక్తులకు లీజ్ కిచ్చే అద్దె, పశువుల సంత, వ్యవసాయ పంటల అమ్మకం, కొనుగోలు, ఇసుక రీచ్ వ్యాపార కార్యకలాపాల ద్వారా మార్కెట్‌యార్డుకు సంవత్సరానికి సుమారు రూ. 40 లక్షలకుపైగా ఆదాయం వచ్చిందని చెప్పారు. సిబ్బంది వేతనాలు పోను మిగిలిన డబ్బులు ఏం చేశారని ప్రశ్నించారు. యార్డ్ చైర్మన్, వైస్ చైర్మన్, సెక్రటరీలే నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారనే అనుమానం కలుగుతోందని పేర్కొన్నారు. పై అంశాలపై మార్కెట్ యార్డ్ కమిషనర్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ప్రహరీ కట్టి నేమ్ బోర్డుతో కూడిన ఆర్చి నిర్మించి గేట్ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో సిపిఎం నాయకులు బి. రెడ్డెయ్య, జి.మాధవయ్య బి. శేఖర్ నాయక్ పాల్గొన్నారు.

రాయచోటి పట్టణంలో మానవహారంగా ఏర్పడి నినాదాలుచేస్తున్న అంగన్వాడీలు

అంగన్వాడీల ఆగ్రహం

- నల్ల దుస్తులు ధరించి నిరసన
- ర్యాలీ, అనంతరం మానవహారం
- తాళాలు పగులుగొట్టే చర్యకు స్వస్తి చెప్పకపోతే సమ్మె మరింత ఉధృతం

మదనపల్లె : కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలు

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ అన్నమయ్య జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం నాటికి 5వ రోజుకు చేరుకుంది. జిల్లా కేంద్రమైన రాయచోటిలో అంగన్వాడీలు ఆగ్రహించారు. అధికారుల చర్యలకు నిరసనగా నల్ల దుస్తులు ధరించి సుమారు గంటన్నరపాటు మానవహారం నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వ చరజిల్లా వ్యాప్తంగా ఉన్న ఐసిడిఎస్, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట అంగన్వాడీలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలియజేశారు. కేంద్రాలకు తాళాలు పగులగొట్టించడం, సచివాలయ సిబ్బందికి బాధ్యతలు అప్పగించడం వంటి చర్యలకు ప్రభుత్వం పూనుకుంటోంది. అంగన్వాడీలు మాత్రం సమస్యలు పరిష్కారమయ్యే వరకూ సమ్మె విరమించేది లేదంటూ నినాదాలు చేశారు. అంగన్వాడీల సమ్మెకు పార్టీలు, ప్రజలు, ప్రజా సంఘాల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోంది.

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీలు చేస్తున్న సమ్మె శనివారం 5వ రోజు కొనసాగింది. అంగన్వాడీ కార్యకర్తలు నల్లదుస్తులు ధరించి తమ నిరసన కొనసాగించారు. ముందుగా రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి రాజధాని హోటల్, శివాలయం, మదనపల్లె రోడ్డు మీదుగా బస్టాండ్, బంగ్లా సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎర్రజెండాను చేతబట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బంగ్లా సర్కిల్ వద్ద గంటన్నరసేపు మానవహారంగా ఏర్పడి ఆందోళన చేపట్టారు. కడప, పీలేరు, రాయచోటి బస్టాండ్ మూడు వైపులా సుమారు రెండు కిలో మీటర్ల వరకు వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు ప్రధాన క్యాదర్శి డి. భాగ్యలక్ష్మి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు మాట్లాడుతూ మంత్రి బొత్స సత్యనారాయణ తాళాలు పగలగొట్లాని ప్రభుత్వం చెప్పలేదని ప్రకటన చేసినా కలెక్టర్ అత్యుత్సాహంతో సచివాలయ ఉద్యోగులకు సర్క్యులర్ జారీ చేసి తాళాలు పగలకొట్టమనడం భాధాకరమని తెలిపారు. 'కరవు సహాయక చర్యలు ఇంత వరకూ చేయలేదని, మీరు బ్యాంకులు పగలకొట్టి ప్రజలకు సాయం చేయగలరా' అని కలెక్టర్‌ను వారు ప్రశ్నించారు. అన్నమయ్య డ్యామ్ నిర్వాసితులకు మంగంపేట, ముదివేడు రిజర్వాయర్ మైనింగ్ నిర్వాసితులకు, కరువుతో నష్ట పోయిన రైతులనూ ఆదుకోవాలని కలెక్టర్ కు సూచించారు. తాళాలు పగలకొట్టే వారి మీద క్రిమినల్ కేసులు పెడతామని, కోర్టును ఆశ్రయిస్తామని, సమ్మె డిమాండ్లను సాధిస్తామని వారు పేర్కొన్నారు. తాళాలు పగల గొట్టే చర్యకు స్వస్తి పలకకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ లీడర్లు సిద్దమ్మ, బంగారుపాప, ఖాజాబి, నాగమణి, పద్మజ మేరీ, సుమలత జయమ్మ అరుణ అమ్ములు, పెద్ద సంఖ్యలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. **మదనపల్లె :** స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ఆరవ రోజు అంగన్వాడీ కార్యకర్తలు కళ్లకు గంతలు కట్టుకొని సమ్మెను కొనసాగించారు. కార్యక్రమానికి ఎఐటియుసి నాయకులు సాంబశివ తమ సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు రోజులుగా అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మెను నిర్వహిస్తున్నా ప్రభుత్వం మొండిగా వ్యవహ రిస్తోందని వాపోయారు. ప్రభుత్వం స్పందించి అంగ న్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు సాంబశివ నాయకులు ప్రభాకర్ రెడ్డి , యూనియన్ నాయకురాలు మధురవాణి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు . **లక్కిరెడ్డిపల్లి :** అంగన్వాడీల న్యాయమైన హామీల సాధన కోసం లక్కిరెడ్డిపల్లి మహిళా శిశు సంక్షేమ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఐదవ రోజు నల్ల బ్యాడ్జీలతో అంగన్వాడీ సమ్మె కార్యక్రమం చేపట్టారు ఈ సందర్భంగా సిఐటియు ప్రాజెక్ట్ అధ్యక్షురాలు సుకుమారి మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన కోరికలు ప్రభుత్వం నెరవేర్చేంతవరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. సచివాలయ సిబ్బంది తాటిమాకులపల్లి, చెంచర్లపల్లి, బి ఎర్రగుడి అంగన్వాడి సెంటర్ల తాళాలను సచివాలయ సిబ్బంది పగలగొట్టారు. మద్దిరేవుల రెడ్డివారి పల్లి నంది వాండ్లపల్లి గాడ్లపల్లి కోనంపేట - 1, లక్కిరెడ్డిపల్లి పెట్రోల్ బంక్ ఏరియా అంగన్వాడీ కేంద్రాలను శనివారం సచివాలయం సిబ్బంది తెరవలేదు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు సుకుమారి కార్యదర్శి ఓబులమ్మ, రుక్మిణి ప్రభావతమ్మ , లక్ష్మీదేవి నాగమణి పాల్గొన్నారు **పీలేరు :** అంగన్వాడీలు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు చేపట్టిన సమ్మె శనివారం 5వ రోజుకు చేరుకుంది. సిఐటియు, ఎఐటియుసి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మెలో అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు దనాసి వెంకట్రామయ్య, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి సాంబశివ, సిపిఐ జిల్లా నాయకులు నరసింహులు, అంగన్వాడి కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** తమ న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలంటూ తంబళ్లపల్లి నియోజకవర్గం, బి.కొత్తకోట మండల ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన సమ్మె ఐదవ రోజుకు చేరుకుంది. కార్యక్ర మంలో ములకలచెరువు, బి.కొత్తకోట, పిటిఎం మండలాల కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** అంగన్వాడీలను వేధింపులకు గురి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి మహిళల ఉసురు తగులుతుందని టిడిపి నాయకులు మేడా బాబు అన్నారు. డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న అంగన్వాడీల సమ్మె 5వ రోజు కార్యక్రమంలో భాగంగా శనివారం సిడిపిఓ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు కలలకు గంతలు కట్టుకుని వినూత్నంగా నిరసన చేపట్టారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ నిరసన కార్యక్రమానికి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మహేష్, ఏరియా కార్యదర్శి శివరామకృష్ణదేవరా, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఎం.ఎస్. రాయుడు నిరసనలు పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు సరస్వతమ్మ, శివరంజని, విజయమ్మ పాల్గొన్నారు.

అంగన్వాడీలకు అండగా ఉంటా : 'యల్లటూరు'

అంగన్వాడీలకు అండగా ఉంటానని రాజంపేట జనసేన నాయకులు యల్లటూరు శ్రీనివాసరాజు తెలిపారు. శనివారం అంగన్వాడీలు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెను ఆయన సందర్శించి వారికి సంఘీభావం తెలియజేశారు. అంగన్వాడీలకు మధ్యాహ్నం భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లతో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేస్తున్న ఆందోళనకు తనతోపాటు జనసేన పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలియజేశారు. యూనియన్ అధ్యక్షురాలు ఈశ్వరమ్మ, కమిటీ సభ్యులు విజయ, అమరావతి, శివరంజని ఈ సందర్భంగా శ్రీనివాసరాజుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో రాయలసీమ రీజనల్ కో-ఆర్డినేటర్ కుప్పాల జ్యోతి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పీలేరు : ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలుచేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

రాజంపేట : అంగన్వాడీలనుద్దేశించి మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఎమ్మెల్సీ సాబ్జీకి ఘన నివాళి

ప్రజాశక్తి -రాయచోటి

పిడిఎఫ్ ఎమ్మెల్సీ, యుటిఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు సాబ్జీ అకాల మరణం సంఘానికి తీరని లోటు, వారి ఆశయాలను కొనసాగిస్తామని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జాబిర్ తెలిపారు. ఆయన మృతి పట్ల సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నామని అన్నారు. రాయచోటిలో స్థానిక అలీమాబాద్ ఉర్దూ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాబ్జీ తన చివరి శ్వాస వరకు ఉపాధ్యాయ, ఉద్యోగుల, కార్మిక పెన్షనర్ల హక్కుల కోసం నిరంతరం పని చేశారని చెప్పారు. వారి ఆశయాలను సాధించడం, సంఘాన్ని బలోపేతం చేయడం మన ముందున్న కర్తవ్యం అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దావూద్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సురేంద్ర రెడ్డి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ప్రసాద్, రాయచోటి మండల అధ్యక్షుడు హాఫీజుల్లా, ట్రెజరర్ రఫీ, చిన్నమండెం మండల అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, సహాధ్యక్షులు కిఫాయతుల్లా, ట్రెజరర్ ఆదిల్,గాలి వీడు మండల నాయకులు రియాజ్, వీరబల్లి మండల ప్రధాన కార్యదర్శి అమీనుల్లా,లక్కి రెడ్డి పల్లి అధ్యక్షులు రఖీబ్,డైట్ లెక్చరర్ నాగేశ్వర రావు, నాయకులు రాజా బాబు పాల్గొన్నారు. **పీలేరు:** రోడ్డు ప్రమాదంలో మరణించిన ఉభయ గోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ, యుటిఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు షేక్ సాబ్జీకి పీలేరు డివిజన్ యుటిఎఫ్ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. శనివారం రాత్రి స్థానిక గాంధీ సర్కిల్‌లో ఉపాధ్యాయులు కొవ్వత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ సదాశివరెడ్డి, అన్నమయ్య జిల్లా సహాధ్యక్షుడు శివారెడ్డి, కోశాధికారి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి అక్రం బాష, ఉమ్మడి చిత్తూరు జిల్లా మాజీ గౌరవ అధ్యక్షులు రాధాకృష్ణ, కెవి పల్లి మండల అధ్యక్షులు వెంకటరమణ, పీలేరు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వనాథరెడ్డి, వేణుగోపాల్, రమేష్ రెడ్డి విజయ్ కుమార్ రెడ్డి, చెంగారెడ్డి, యుటిఎఫ్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

సాబ్జీ మృతికి సంతాపంగా కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

బోగస్ ఓట్ల నమోదుపై ఫిర్యాదు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వాల్మీకిపురంలోని మూడు ఇంటర్నెట్ కేంద్రాలుగా చేసుకొని అధికార పార్టీ నాయకులు మార్ఫింగ్ కార్యక్రమాలతో ఓట్లు నమోదు కొనసాగిస్తున్నారని టిడిపి రాష్ట్ర బిసి సెల్ అధికార ప్రతినిధి వెంకట్రమణ, మండల పార్టీ అధ్యక్షులు మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో తహశీల్దార్ ఫిరోజ్ ఖాన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో నియమ నిబంధనలకు వ్యతిరేకంగా అధికార పార్టీ నాయకులు మార్పులు, చేర్పులు, తొలగింపులతో పాటు వయస్సు అనర్హతలను అర్హతలుగా మార్ఫింగ్‌లు చేస్తున్నారన్నారు. ఓటర్ల జాబితాలో నమోదు చేసే వ్యక్తికి సంబంధించిన వయస్సును నిర్ధారించే విద్యార్హత ధృవీకరణ పత్రాలను మార్ఫింగ్ చేసి బిఎల్‌వోలపై ఒత్తిడి తీసుకొచ్చి 15, 16 ఏళ్ల వయస్సు గల వారి పేర్లను నమోదు చేయిస్తున్నారని విమర్శించారు. మండలంలో దాదాపు 2300 ఓట్లను ఇదే పద్ధతిలో చేస్తున్నారని వారు తహశీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. పది సంవత్సరాల ముందు చనిపోయిన వారి పేర్లను ఇప్పటికీ తొలగించలేదని ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం జరగకపోతే కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గాంధీపేట రమణ, రాజేంద్రాచారి, పివి నారాయణ, రమేష్, బొక్కసం ఆనంద, కేకే, సయ్యద్‌బాషా, జాఫర్, తాహీర్, సయ్యద్ పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ములక్కాయల సుమిత్ర

రాజంపేట అర్బన్ : మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా ములక్కాయల సుమిత్ర, ఉపాధ్యక్షులుగా ఆమె భర్త పోలి మురళి రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రభుత్వం నుంచి ఈ మేరకు శనివారం ఉత్తర్వులు వెలువడినట్లు పోలీమురళి రెడ్డి తెలిపారు. గతంలో మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఉన్న పోలి రామసుబ్బమ్మ, వైస్ చైర్మన్ పోలి వెంకటసుబ్బారెడ్డి ఇటీవల వైసిపిని వీడి తెలుగుదేశం పార్టీలో చేరడంతో వారిని మార్కెట్ కమిటీ పదవి నుంచి తొలగించారు. వారి స్థానంలో సుమిత్ర, మురళి రెడ్డిలను చైర్మన్, వైస్ చైర్మన్‌గా నియమిస్తూ ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు తీసుకొచ్చారు.

సమావేశాన్ని విజయవంతం చేయాలి : ఆర్ఆర్

రాయచోటి : రాయచోటి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం, మైనార్టీల ఆత్మీయ సదస్సును విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆర్ రమేష్ కుమార్ రెడ్డి శనివారం ఒక ప్రకటన పేర్కొన్నారు. రాయచోటి పట్టణం చెన్నముక్కపల్లెలో నారాయణ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి పొలిట్ బ్యూరో సభ్యులు, శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్ హాజరు అవుతున్నారు. మధ్యాహ్నం 2. 30 గంటలకు ముస్లిం పెద్దలు, ముస్లిం సోదరులతో రౌండ్ టేబుల్ సమావేశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమానికి రాయచోటి నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, సర్పంచులు, నియోజకవర్గ టిడిపి మైనార్టీ సెల్ విభాగ నాయకులు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా విజయ్ దివస్

రాజంపేట అర్బన్ : స్థానిక రాయలసీమ పాఠశాలలో శనివారం విజయ్ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ సభ్యులు, రాష్ట్ర ప్రధాన న్యాయ సలహాదారు టి.లక్ష్మీ నారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుని భవిష్యత్తులో తాము కూడా దేశం కోసం ఏం చేయడానికైనా వెనకాడబోమని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. డిసెంబర్ 16 1971 వ సంవత్సరంలో పాకిస్తాన్ పై భారతదేశం విజయం సాధించి బంగ్లాదేశ్ స్వతంత్ర రాజ్యాంగ అవతరించడానికి కారణమైన రోజని తెలిపారు.

దొంగ ఓట్లకు పాల్పడింది టిడిపినే

- రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

రాబోవు ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలిస్తే సంక్షేమ పథకాలన్ని రద్దు చేస్తారని, దొంగ ఓట్లకు పాల్పడింది టిడిపినే అని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, వైసిపి జిల్లా అధ్యక్షుడు మద్దెల రవీంద్ర అన్నారు. శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధి టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకు పట్టదని, కేవలం దోచుకోవడం, పంచుకోవడమే టిడిపి నాయకుల విధానమన్నారు. పొరపాటున కూడా చంద్రబాబు ప్రభుత్వం వస్తే వాలంటీరు, సచివాలయ, ఆర్‌బికే వ్యవస్థలను రద్దు చేస్తారని, ఇంటి వద్దే అందిస్తున్న రేషన్, పింఛను, వైద్యం లేకుండా చేస్తారని పేర్కొన్నారు. నాడు - నేడు పథకంలోఅన్ని హంగులతో నాణ్యమైన విద్యను అందిస్తున్న బడులను మూసివేస్తారని తెలిపారు. వివిధ కులాలు, వృత్తుల వారికి ,మహిళలకు డిబిటి విధానంలో అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని కూడా రద్దు చేశారని చెప్పారు. ఆరోగ్యశ్రీ సేవలను తగ్గిస్తారని, 108, 104 సేవలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తారన్నారు. చివరకు రాష్ట్రంలో వర్షాలు కూడా పడే పరిస్థితి ఉండదని విమర్శించారు. పీలేరు నియోజకవర్గంలో మళ్లీ వైసిపి జెండా ఎగరడం ఖాయమని, రాబోవు ఎన్నికల్లో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హ్యాట్రిక్ విజయం సాధించి రికార్డును సృష్టించబోతున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రాజధానిలో నివాసం ఉంటూ అప్పుడప్పుడు వలస పక్షిగా నియోజకవర్గాన్ని విజిట్ చేస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నల్లారి కిషోర్ కుమార్ రెడ్డిని ప్రజలు ఎప్పటికీ నమ్మరని చెప్పారు. ముచ్చటగా మూడోసారి ఆయన ఓటమిని చవిచూడక తప్పదన్నారు. దొంగ ఓట్లతో గెలిచే సంస్కృతి టిడిపిదేనని పేర్కొన్నారు. బ్లాక్ మెయిలింగ్ రాజకీయాలతో ప్రజాభిమానాన్ని పొందలేరని, దిగజారుడు రాజకీయాలను మానుకొని హుందాగా ప్రవర్తించాలన్నారు. సమావేశంలో సర్పంచ్ ముని భాస్కర్, నాయకులు రవీంద్రారెడ్డి, రెడ్డప్ప రెడ్డి, నరసింహులు, చిన్నోడు, బుడ్డయ్య, వెంకటరమణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అబ్దుల్ కలీమ్

ఉధృతం

ప్రజాదృష్టి

ఉమ్మడి జిల్లాలో ఉద్యమం ఉధృతరూపం దాల్చింది. ఒకవైపు అంగన్వాడీ, మరోవైపు ఆశా కార్యకర్తలు తమ న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలని కోరుతూ ఉద్యమ పథంలో సాగుతున్నారు. 2017లో ప్రతిపక్ష నేత హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సాగించిన పాదయాత్ర సందర్భంగా తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణా అంగన్వాడీ, ఆశాల కంటే వెయ్యి రూపాయల వరకు అధికంగా వేతనం చెల్లిస్తామన్న హామీని అమలు చేయాలని గుర్తు చేయడం న్యాయసమ్మతమే. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరడమూ సహేతుకమైన డిమాండే. వీటితోపాటు మినీ అంగన్వాడీలకు ప్రమోషన్లు కల్పించాలనే పలు డిమాండ్లను సర్కారు ముందుంచారు. రాష్ట్రప్రభుత్వం అంగన్వాడీల, ఆశాల డిమాండ్లు సమ్మత మేనని అంగీకరించి స్పష్టమైన వైఖరితో ముందుకు రావాలి. అలా గాకుండా తాత్సారం చేస్తే అట్టడుగు సెక్షన్ సంక్షేమాన్ని నమ్ముకుని ఎన్నికల గోదాలోకి దూకుతున్న సర్కారుకు సంక్షేమ ఫలితం బూమ రాంగ్ కావడం తథ్యమనే చెప్పుకోవాలి. సంక్షేమం, అభివృద్ధి ఫలి తాల్ని సమ్మిళిత చేసి, వ్యూహాత్మక ఎత్తుగడలు అనుసరిస్తేనే సత్ఫలి తాలు ఉంటాయనేది అనుభవైద్యేకమే. ఇటువంటి కీలక సమయంలో నాలుగవ తరగతి ఉద్యోగుల జీవితాలతో ఆటలాడుకోవడం సమర్థనీయం కాబోదు. 2019 మేలో అధికారం చేపట్టిన వెంటనే కరోనా మహమ్మారి విజృంభణ కారణంగా నాలుగవ తరగతి ఉద్యోగులు తమ డిమాండ్లను అమలు చేయాలని అడగటానికి సందేహించారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయం తరుముతున్న నేపథ్యంలో ఇచ్చిన హామీలను మరిచిపోవడం సహేతుకం కాదని గుర్తు చేయడం సందర్భోచితమనే చెప్పాలి. రాష్ట్రపగ్గాలు ఎవరు చేపట్టాలన్నా నాలుగో తరగతి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తేనే ఆశించిన ఫలితాలు సిద్ధించే అవకాశాలు ఉంటాయని చెప్పుకోవచ్చు. అలా గాకుండా ఒంటెత్తుపోకడలతో ముందుకెళ్తే దుష్ఫలితాలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాల్సిందే. అంగన్వాడీ, ఆశాల ఉద్యమాన్ని గౌరవించకుండా బలవంతంగా మూతబడిన అంగన్వాడీ సెంటర్ల తాళాలను పగలగొట్టించడం వంటి నియంతృత్వపు పోకడలకు వెళ్లడం ఉద్యమాన్ని అగౌరవ పరచడమే అవుతుంది. అధికార వైసిపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఉద్యమ పంథానే ఎంచుకుందనే సంగతిని గుర్తుంచుకోవాలి. అప్పటి ఉద్యమ ఫలితమే ఇప్పటి వైభోగమేననీ గుర్తెరగాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో అమలు చేసే ఉద్యోగులను గౌరవించకపోయినా పర్వాలేదు కానీ అవమానించడం ఎంతమాత్రం తగని పని. ఉద్యమసంఘాలతో సంప్రదింపులు చేయా లి. దీని వల్ల సమయస్ఫూర్తిని చాటుకోవడంతోపాటు పాలకుల పట్ల గౌరవం హెచ్చవుతుందని చెప్పవచ్చు. అలా చేయకుండా బలవం తంగా అంగన్వాడీ కేంద్రాలను తెరచొచ్చు. కానీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లడం ఎంతవరకు సాధ్యమో ఆలోచిం చుకోవాలి. పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలు, వాటి అమ లు, మిగిలిన హామీల అమలుకు గల అడ్డంకులను వివరిస్తూ సంప్ర దింపుల ద్వారా సమస్యను పరిష్కరించుకునే ప్రయత్నం చేస్తే ఉభయ పక్షాలకు ఉభయతారకమని చెప్పవచ్చు.

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

ప్రతి విద్యార్థికీ లక్ష్యం ముఖ్యం

డిఆర్‌డిఒ డైరెక్టర్ జనరల్ ఎం.కె. హడ

ప్రజాశక్తి-మదనపల్లి

ప్రతి విద్యార్థికీ లక్ష్యమనేది చాలా ముఖ్యమని, ఆ లక్ష్యం కోసం ఇష్టపడి చదవాలని న్యూఢిలీకి చెందిన డిఆర్‌డిఒ డైరెక్టర్ జనరల్ ఎం. కె. హడ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో ఫ్రెషర్స్ డే ను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థి దశ మీ వందేళ్ల జీవితానికి పునాది అని అన్నారు. విద్యార్థి దశను ఎంజాయ్ చేస్తూ తమ లక్ష్యాన్ని సాధించాలని పేర్కొన్నారు.. మీకు ముఖ్యంగా ఏ రంగం ఆసక్తో అందులోనే మీరు పట్టు సాధించాలని చెప్పారు. కలలు సాధించడం మీ చేతి లోనే ఉంది అనేది గుర్తు పెట్టుకోవాలని అన్నారు. సమాజానికి పనికొచ్చే విధంగా సాంకేతిక రంగంలో కొత్త పరిశోధనలు చేయాలని ఆయన అన్నారు. కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్. విజయభాస్కర్ చౌదరి మాట్లాడుతూ తమ కళాశాల మీద నమ్మకంతో మీ తల్లి దండ్రులు మిమల్ని చేర్పించి చదివిస్తున్నారని, అంతే నమ్మకంతో మీ భవిష్యత్తును ఉన్నత స్థానాలకు తీసుకువెళ్తామని ఆయన అన్నారు. బి.టెక్ విద్యార్థులకు నాలుగు సంవత్సరాలు ఎంసిఎ, ఎంబిఎ విద్యార్థులు రెండేళ్లు చాలా ముఖ్యమని ఆయన అన్నారు. ఎం..కె హడ దేశానికి చాలా ముఖ్యమైన వ్యక్తి అని, డిఫెన్స్ రీసెర్చ్ డెవలప్మెంట్ అనేది ఎంతో ముఖ్యమైన సంస్థ అని చెప్పారు. ఆయన సమయాన్ని మనకోసం కేటాయించి ఇక్కడికి విచ్చేసినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్ఆర్ఆర్ అకాడమీ ప్రెసిడెంట్ నాదెళ్ల ద్వారకానాథ్, ప్రినిపల్ డాక్టర్ సి. యువరాజ్, ఫస్ట్ ఇయర్ కో - ఆర్డినేటర్ డాక్టర్ చంద్ర మోహన్, విద్యార్థులుపాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎం.కె. హడ

ఆరోగ్యశ్రీ పరిమితిని పెంచడం చారిత్రాత్మకం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పేదల ఆరోగ్య సంజీవిని డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకమని, రూ. 5 లక్షల పరిమితి ఉన్న ఆరోగ్యశ్రీ కార్డు పరిమితిని సిఎం జగన్ ఏకంగా రూ.25 లక్షలకు పెంచడం చారిత్రాత్మకమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ కార్డు ఉందంటే ఆ వ్యక్తికి రూ.25 లక్షలు వరకూ వైద్యం ఉచితంగా లభిస్తుందని చెప్పారు. ఎలాంటి సమస్యలు వచ్చినా వైయస్సార్ ఆరోగ్యశ్రీ అండగా నిలుస్తుందన్నారు. అన్ని రకాల కేన్సరలకు పరిమితి లేకుండా ఉచితంగా వైద్యం అందిస్తున్నారన్నారు.వార్షిక ఆదాయం రూ.5 లక్షలు ఉన్న ప్రతి ఒక్క కుటుంబాన్ని ఆరోగ్యశ్రీ పరిధిలోకి చేర్చడంతో రాష్ట్రంలో 90 శాతం కుటుంబాలు ఆరోగ్యశ్రీతో లబ్ధి పొందుతున్నారన్నారు. ఈనెల 18 నుంచి కొత్త ఆరోగ్యశ్రీ కార్డులను ప్రభుత్వం పంపిణీ చేస్తుందని చెప్పారు. ఆరోగ్యశ్రీ కార్డుతో పాటు ఆరోగ్యశ్రీ బ్రోచర్లును కూడా పంపిణీ చేసి, ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్ లోడ్ చేయిస్తారని చెప్పారు. క్యూ ఆర్ కోడ్‌లతో కూడిన ఆరోగ్యశ్రీ కార్డులను ప్రభుత్వం జారీ చేస్తోందన్నారు. క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసిన వెంటనే కార్డులో ఉన్న సభ్యుల మెడికల్ రికార్డులను చూసుకునే సౌలభ్యం ఉంటుందన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ శేషగిరిరావు

'సంకల్పయాత్ర'ను విజయవంతం చేయాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వికసిత్‌భారత్ సంకల్పయాత్రను మండలంలో విజయవంతం చేయాలని ఎంపిడిఒ శేషగిరిరావు అన్నారు. శనివారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇఒపిఆర్‌డి చలపతిరావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్‌బాబులతో కలిసి మండల అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు, మహిళా పోలీసులకు, సచివాలయ డిజిటల్ సహాయకులకు వికసిత్‌భారత్ సంకల్పయాత్ర నిర్వహణపై అవగాహన కల్పిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వాటి ఉపయోగాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈనెల 18 నుంచి చేపట్టిన వికసిత్ భారత్ సంకల్పయాత్రను మండల అధికారులు విజయవంతం చేయాలని అన్నారు. వైద్య ఆరోగ్యానికి, గ్యాస్ సిలిండర్ పథకానికి, వ్యవసాయ అనుబంధ పథకాలు, కిసాన్ కార్డుకు, అంగన్వాడీ ద్వారా అందుతున్న పోషకాహార పథకానికి సంబంధించి ప్రత్యేక ప్రదర్శనలను ప్రదర్శించడం జరుగుతుందన్నారు. సోమవారం నుంచి ఐదు రోజులపాటు మండలంలోని ప్రతి పంచాయతీలోనూ నిర్వహిస్తామన్నారు. మండల అధికారులు అందరూ తప్పక హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒ నారాయణ, అంగన్వాడీ సూపర్వైజర్ భానులక్ష్మీదేవి, ఎపిఎం రజనికుమారి, ఎపిఒ రమేష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ హరినాథ్‌రెడ్డి, గృహ నిర్మాణశాఖ ఎఇ అమర్నాథ్, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

20న బి.కొత్తకోట మండల సమావేశం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండల సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం అనగా ఈనెల20న స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ శంకరయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరుపై ఈ సమావేశంలో చర్చించ నున్నారన్నారు. అధికారులు తమ శాఖలకు సంబంధించి ప్రగతి నివేదికలను సిద్ధం చేసుకొని రావాలన్నారు. ఈ సమావేశానికి మండలంలోని ఎంపిపి, జడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని తెలిపారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ క్రీడలకు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి-కలకడ

హరితను అభినందిస్తున్న ప్రిన్సిపల్ సుమిత్ర

మండలంలోని గరుడప్పగారిపల్లెలో ఉన్న బాలికల గురుకుల పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న ఎన్.హరిత రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సుమిత్ర, పిఇటి రేవంత్‌కుమార్ తెలిపారు. చిత్తూరులో జిల్లాస్థాయిలో జరిగిన 400 మీటర్ల హర్డిల్స్ ఈవెంట్స్‌లో పాల్గొని తృతీయస్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైందని తెలిపారు. .ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యతో పాటు విద్యార్థులకు క్రీడలు కూడా రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

సుభాష్‌చంద్రబోస్ చేరిక వైసిపికి బలం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పలమనేరులో ఆర్.వి.సుభాష్‌చంద్రబోస్ చేరికతో వైసిపికి బలం పెరిగిందని పలమనేరు నియోజకవర్గ పరిశీలకులు పాగొండఖలీల్ అహ్మద్ పేర్కొన్నారు. సిఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సమక్షంలో ఆయన వైసిపిలో చేరడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా ఖలీల్‌అహ్మద్ మాట్లాడుతూ 175 నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారన్నారు. పలమనేరులో రాజకీయంగా తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న నాయకుడు చంద్రబోస్ అని కొనియాడారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి విజయకేతనం ఎగువ వేయడం ఖాయమని అన్నారు.

గొల్లపల్లిలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

కాలువలో పూడికను తొలగిస్తున్న జెసిబి

మండలంలోని రాచవేటివారిపల్లి పంచాయతీ పరిధిలోని గొల్లపల్లిలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ సుబ్రమణ్యం తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలు కారణంగా గొల్లపల్లిలోని మురుగునీటి కాలువలు పూర్తిగా పూడిపోయి వర్షపునీరు మొత్తం రోడ్డుపై నిలిచి బురద మయం అయిందని అన్నారు. సమస్యను ప్రజలు తమ దృష్టికి తేవడంతో వర్షపు నీటిని వేరొక కాలువలోకి మళ్లించామన్నారు. కాలువలు చిన్నవిగా ఉండటంతో మురుగునీటి కాలువలు పూడిపోయి దుర్వాసన వెదజల్లుతునడం, రోడ్డుపై బురద ఉండటంతో రాకపోకలు కొనసాగించటానికి నిత్యం ప్రజలు, పశువులు, మేకలు, గొర్రెలు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నాయని ప్రజలు మరల సమ స్యను సర్పంచ్ సుబ్రమణ్యం, పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. సర్పంచ్ జెసిబి సాయంతో మురుగునీటి కాలువలలోని పూడికలను తొలగించారు. త్వరలోనే ప్రజలకు ఉన్న పారిశుధ్య సమస్యలను తొలగించడానికి ప్రత్యేక చర్యలను చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న టిడిపి నాయకులు

తప్పుల్లేని ఓటరు జాబితాకు వినతి

ప్రజాశక్తి-కలకడ

తప్పుల్లేని ఓటరు జాబితా తయారు చేయాలని తహశీల్దార్ ప్రదీప్‌కు శనివారం టిడిపి నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు ఓటుహక్కు రాని వయసు వారిని, మృతి చెందిన వారిని గ్రామాలలో లేనివారిని ఓటర్లుగా నమోదు చేసి, మోసం చేస్తున్నారని అన్నారు. వాటిని పసిగట్టి నిష్పక్ష పాతంగా ఓటరు జాబితా తయారు చేయాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు సర్పంచ్ విశ్వనాథ నాయుడు, శ్రీనివాసులురెడ్డి, జిలానిబాషా, ఇర్ఫాన్ బాషా, జిరాక్స్ అలి, ఇన్షాద్ అలీ , నౌషాద్ అలీ ,రైస్ మిల్ రమణ, పేరయ్య, ఈశ్వర్, ఆనందరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని హెచ్.చెర్లోపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు శనివారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఎం.నాగేశ్వరగౌడ్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీదేవి, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ చంగల్‌రాజు, జిల్లా కార్యదర్శి వెంకటసుబ్బయ్య, మండల అధ్యక్షులు నాగేంద్ర, ఉపాధ్యాయులు సూర్యారావు, వెంకటసుబ్బయ్య, జనార్ధన్, చిన్న గంగయ్య, ప్రశాంత్ విద్యార్థులు పాల్గొన్నారు.

నామమాత్రంగా మండల సమావేశం

ప్రజాశక్తి-చిట్వేలి

సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ శిరీష

మండల పరిధిలోని స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ఎంపిడిఒ శివరామిరెడ్డి, ఎంపిపి టంగుటూరు చంద్ర, వైస్ ఎంపిపి సుబ్రహ్మణ్యంరెడ్డి, అధ్యక్షతన ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశం నామమాత్రంగా ముగిసింది. ప్రజాసమస్యలు పరిష్కారం చేయలేని అధికారులు ప్రజాప్రతినిధులు ఎందుకని రాజగుంట పంచాయతీ ఇండిపెండెంట్ సర్పంచ్ గుత్తి నరసింహ మండిపడ్డారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ రాజుగుంట పంచాయతీకి రెండు సంవత్సరాల నుంచి సమస్యలకు పరిష్కారం అడుగుతున్నా అధికారులు,నాయకులు స్పందించలేదని విమర్శించారు. విద్యుత్ లేని సమయంలో తాగునీటికి ప్రజల అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయంగా చేతి పంపులు ఏర్పాటు చేయమని ప్రాధేయపడిన అధికారుల పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. గ్రామంలో సమస్యలు గ్రామస్థాయిలో ఉన్న ప్రజాప్రతినిధికే ఆ బాధ ఎలా ఉంటుందో తెలుస్తుందని అన్నారు. అనంతరం తహశీల్దార్ శిరీష మాట్లాడుతూ రేషన్ పంపిణీలో, రేషన్ పంపిణీ వాహనాలు డ్రైవర్ లేకపోవడంతో కొంతమేర ఆలస్యం జరిగిందన్నారు. మండలంలోని ఖాళీగా ఉన్న రేషన్ వాహనాలకు డ్రైవర్లు నియామకం కొరకు ఎవరైనా ఉంటే తహశీల్దార్ కార్యాలయానికి వచ్చి సంప్రదించాలన్నారు. విద్యుత్‌శాఖ ఎఇ చలపతిరావు మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్ మీటర్లు ఉన్న రైతులు సబ్సిడీ కొరకు పాస్ బుక్, ఆధార్, బ్యాంక్ పత్రాలను కార్యాలయం వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశానికి ఆర్‌అండ్‌బి, నీటిపారుదల, శాఖ అధికారులు రాకపోవడం ఆశ్చర్యం. ఉదయం 11 గంటలకు మొదలైన సమావేశం గంటపాటుతోనే సమావేశాన్ని ముగించేయడం చర్చనియాంశంగా మారింది. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు ఎల్‌వి మోహన్‌రెడ్డి, అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రాణభిక్ష పెట్టండి

కేన్సర్ బారిన పడిన ఏడు నెలల చిన్నారి ఆదుకోవాలని తల్లిదండ్రుల వేడుకోలు

కేన్సర్ బారిన పడిన చిన్నారితో తల్లిదండ్రులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

అభం,శుభం తెలియని ఏడు నెలల చిన్నారి భయంకరమైన కేన్సర్ వ్యాధి బారిన పడిందని, ప్రభుత్వం ఆ చిన్నారికి ప్రాణభిక్ష పెట్టాలని నగర పంచాయతీ అటెండర్ ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలోని దేగానిపల్లిలో నివాసముండే దళితులు సి.రమణప్ప, నాగమణిల కుమార్తె ఏడు నెలలు కూడా నిండకుండానే కేన్సర్ బారిన పడిందన్నారు.తల్లిదండ్రులు మదనపల్లెలోని ఎంఎల్ఎల్ ఆస్పత్రికి తీసుకువెళ్లి చిన్నారికి పరీక్షలు చేయించగా కేన్సర్‌గా నిర్ధారించారని చెప్పారు. మదనపల్లిలో వైద్యం కుదరదని,వేలూరు సిఎంసి ఎమర్జెన్సీ ఆస్పత్రికి రెఫర్ చేశారని తెలిపారు. చిన్నారికి వేలూరు సిఎంసికి తరలించగా ఇరవై లక్షల వరకు ఖర్చు అవుతుందని, ఎమర్జెన్సీ వార్డుకు తరలించడానికి పది లక్షల రూపాయలు అడ్వాన్స్ చెల్లించాలన్నారు. ఇప్పటికే ఆ నిరుపేద కుటుంబ సభ్యులు దాదాపు లక్ష రూపాయల వరకు అప్పుచేసి ఖర్చు చేశారని, ఇప్పుడు అంత డబ్బు కట్టలేక దిక్కుతోచని స్థితిలో మళ్లీ వస్తామని చెప్పి స్వగ్రామానికి వచ్చారని తెలిపారు.ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి ఎంతోమందికి నిరుపేదలకు అదుకున్నారని,మా పాపకు కూడా పునర్జన్మనివ్వాలని వేడుకుంటున్నారు. మనసున్న దాతలు, ప్రభుత్వం ఆదుకుని మా బిడ్డకు ప్రాణబిక్ష పెట్టాలని ఆ చిన్నారి తల్లిదండ్రులు ముకులిత హస్తాలతో వేడుకుంటున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని నిరసన

ఎంఆర్‌సి భవనం ఎదుట నిరసన చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

తమకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ మండలంలో సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్, అకౌంటెంట్, సిఆర్‌పిలు, మెస్సెంజర్, ఐఇఆర్‌టి కాంట్రాక్టు ఉద్యోగులు శనివారం మండల వనరుల కేంద్రం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు పరచాలని కోరారు. ఇపిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు ప్రతి నెల ఒకటవ తేదీలోపు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆదివారం నుంచి పెన్‌డౌన్, 20 నుంచి సమ్మె బాటపడతామని అన్నారు. సమ్మెకు ఎస్‌టియు, యుటిఎఫ్ నాయకులు భాస్కర్‌రెడ్డి, నీలేష్‌లు సంపూర్ణ మద్ధతు తెలపడం హర్షణీయమన్నారు.

డ్వాక్రా సంఘాలకు సమావేశాలే ప్రధానం

సమావేశంలో మాట్లాడుతున్న ఖాదర్‌వలీ

ప్రజాశక్తి-వీరబల్లి

స్వయం సహాయక సంఘాలకు సమావేశాలు ప్రాముఖ్యమని వైఎస్ఆర్ క్రాంతిపథం సహాయ ప్రాజెక్ట్ మేనేజర్ ఖాదర్‌వలి అన్నారు. శనివారం మట్లి తొగటపల్లి ప్రాథమిక పాఠశాలలో జరిగిన మట్లి గ్రామ సమాఖ్య కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. సమావేశాలు జరుపుకోని సంఘాలకు భవిష్యత్తు ఉండదన్నారు. సమావేశాల్లో పొదుపులు చేయడం, పుస్తకాలు రాయించుకోవడం,అన్నిరకాల లావాదేవీలు జరుపుకోవడం వల్ల సంఘాలు బలంగా ఉంటాయన్నారు. పొదుపు ఖాతాలో ఉన్న మొత్తాన్ని మొదటి ప్రాధాన్యత కింద ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సిసిలు కుల్లాయప్ప, వెంకటలక్ష్మి, వివోఎ రాజేశ్వరి, సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీదేవి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అనుబంధ విభాగ కమిటీ సెక్రటరీగా జాఫర్

ప్రజాశక్తి-కలకడ

జిల్లా అనుబంధ విభాగ కమిటీలో సెక్రటరీగా ఎస్.జాఫర్ నియామకమయ్యారు. మండల కేంద్రంలోని కలకడలో నివాసమున్న మునీర్‌అహ్మద్ కుమారుడు ఎస్.జాఫర్ వైసిపిలో తన వంతు కృషి చేస్తూ పార్టీ బలోపేతానికి ఎల్లవేళలా క్షమించినందుకు గాను అధిష్టానం గుర్తించి ఈ పదవిని ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడుతూ తనమీద నమ్మకం ఉంచి పదవిని ఇచ్చినందుకు తాను రుణపడి ఉంటానని అన్నారు. పార్టీ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చూస్తూ వచ్చే ఎన్నికల్లో మరల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిని చేయడమే తమ లక్ష్యమన్నారు.

వైసిపి బిసి సెల్ కార్యదర్శిగా పరశురామ్

గాలివీడు : వైసిపి బిసి సెల్ కమిటీ కార్యదర్శిగా మండలంలోని పక్కిరెడ్డిగారిపల్లెకు చెందిన బండి వెంకటసాయిపరశురామ్‌ను పార్టీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా పరశురామ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా బిసి సెల్ కమిటీ కార్యదర్శిగా ఎంపిక చేయడం హర్షణీయమన్నారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే గడికొట శ్రీకాంత్‌రెడ్డికి, వైసిపి కన్వీనర్ యధుభూషణ్‌రెడ్డికి, మండల మైనార్టీ నాయకులు ఖాదర్ మొహియుద్దీన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడి పనిచేస్తానని తెలిపారు.

ఘనంగా జెర్రీ జెండా

ప్రజాశక్తి-నందలూరు

నందలూరు రైల్వే కేంద్రంలోని శ్రీ హజరత్‌ఖాదర్‌వల్లి ఉరుసు ఉత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన జెర్రీ జెండా శుక్రవారం రాత్రి వైభంగా నిర్వహించారు. నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ, అరవపల్లె గ్రామంలోని సయ్యద్ అమీర్ ఇంటి వద్ద నుంచి పురవీధుల మీదుగాదర్గా వరకు మేళ తాళాలు, డప్పు వాయిద్యాల, బాణాసంచాల నడుమ జండా ఊరేగింపు ఉత్సాహంగా కొనసాగింది. మతసామరస్యానికి ప్రతీకగా హిందూ, ముస్లిం సోదరులు ఈ వేడుకలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు నందలూరు దర్గా చిన్న గురువులయ్య, షమీవుల్లా ఖాన్, చోటానూరు, సలీం, విశ్రాంత ఉద్యోగి ఖాదర్ వల్లి, తాటి సుబ్బరాయుడు, ఆర్ముగం విశ్వనాథ్, నారప శెట్టి వేణు, శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

వాలంటీర్లకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి -నందలూరు

మండలంలోని 175 మంది వాలంటీర్లకు తమ సొంత సంస్థ అయిన ఎంఆర్ కెఆర్ కన్‌స్ట్రక్షన్, ఇండస్ట్రీస్ ద్వారా దుస్తులను అందించినట్లు రాజంపేట ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జున్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద వ్యవసాయ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి, గడికోట వెంకటసుబ్బారెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు ప్రధాన కార్యదర్శి సయ్యద్‌అమీర్, మండల కో -ఆప్షన్ సభ్యులు కలీముల్లా ఖాన్, సర్పంచ్ జంబు సూర్యనారాయణ, మైనుద్దీన్, నాయకులు ఆర్ముగంవిశ్వనాథ్, గుణ యాదవ్, లక్ష్మీ నరసయ్య, పనతల రామచంద్రయ్య, ఎంపిడిఒ సౌభాగ్యమ్మ, ఇఒఆర్‌డి సతీష్ కుమార్, సచివాలయసిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్‌కు ఉత్తమ అవార్డు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

డిజిపి నుంచి ఉత్తమ అవార్డు అందుకుంటున్న శివరామకృష్ణ

నిమ్మనపల్లి మండల పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మిరియాల శివరామకృష్ణ శని వారం ఉత్తమ అవార్డును డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి నుంచి అందుకున్నారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఆయనకు ఈ అవార్డు దక్కిందని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే కేసులను త్వరతగితన చేదించడం, నాటు సారా తయారీని అరికట్టడం, జూదాలు, కోడిపందెలు, నేరాలను అదుపు చేయటంలో శివరామకృష్ణ కీలకంగా వ్యవహరించారని అన్నారు. ఉత్తమ అవార్డు రావడంపై ఎస్ఐ రామకృష్ణ, నిమ్మనపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది అభినందించారు.

సాధన స్కూల్‌కు జాతీయ స్థాయి ఎక్సలెన్సీ అవార్డు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరులోని సాధనస్కూల్ కరస్పాండెంట్ వినుతరెడ్డి ఎక్సలెన్సీ పురస్కారం అందుకున్నారు. బ్రెయిన్ ఫీడ్ మేగజైన్ దేశ వ్యాప్తంగా విద్యారంగలో విశిష్ట సేవలు అందిస్తున్న పాఠశాలలను ఎంపిక చేసి వారికి జాతీయస్థాయిలో ప్రతిష్టాత్మక ఎక్షలెన్సీ అవార్డులను ప్రదానం చేస్తారు. ఈ ఏడాది ఆ అవార్డుకు పీలేరు సాధన స్కూల్ ఎంపికైంది. గురువారం హైదరాబాద్ హైటెక్ సిటి ఎగ్జిబిషన్ హాల్-2లో నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవంలో కరస్పాండెట్ వినుతరెడ్డి అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా శనివారం వినుతరెడ్డి మాట్లాడుతూ ఈ అవార్డు అందుకోవడంతో తమ విద్యాసంస్థ బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఇంత గొప్ప పురస్కారం రావడానికి కృషి చేసిన తమ పాఠశాల ఉపాధ్యాయ బృందానికి, సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు, విద్యార్థులకు ధన్యవాదాలు తెలుపుకున్నానని అన్నారు. ఈ ప్రిస్టేజియస్ అవార్డు రావడం పీలేరు పట్టణంతో పాటు జిల్లాకే గర్వకారణమని చెప్పారు.

ఎక్సలెన్సీ అవార్డును అందుకుంటున్న వినుతరెడ్డి

మాట్లాడుతున్న హెచ్‌ఎం చంగల్ రాయుడు

విద్యా ప్రమాణాలపై సమీక్ష

ప్రజాశక్తి-కలకడ

విద్యార్థులు విద్యా ప్రమాణాలపై తల్లిదండ్రులతో సమీక్షా సమావేశం నిర్వహించినట్లు కోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంగల్‌రాయుడు తెలిపారు. పాఠశాలలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి ఇటీవల జరిగిన సమ్మేటివ్-1 పరీక్షలో విద్యార్థులు సాధించిన ప్రగతి గురించి చర్చించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపాలని కోరారు. ఇంటి దగ్గర టివిలు, సెల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని సూచించారు. పిల్లలు చదువు కొనే వాతావరణం కల్పించాలని అన్నారు. విద్యార్థులతు ప్రగతి పత్రాలు తల్లిదం డ్రులుకు అందించి సమీక్ష చేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లింద్రులు, ఉపా ధ్యాయలు శివా రెడ్డి, మహేశ్వరి, రమేష్‌రెడ్డి, గఫార్ ఖాన్, నౌషాద్, సైరాబాను, రెడ్డెప్ప పాల్గన్నారు.

గజమాలతో స్వాగతం పలుకుతున్న తల్లెం భరత్

జడ్‌పి చైర్మన్‌కు ఘనసన్మానం

ప్రజాశక్తి-పుల్లంపేట

తిరుమలకు 21వ మహా పాదయాత్రకు వెళుతున్న జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్నాథరెడ్డిని కొత్త మంగంపేట ఆర్‌ఆర్ సెంటర్-1 వద్ద గుంతకల్ రైల్వే బోర్డు మెంబర్, చిత్తూరు జిల్లా జెసిఎస్ కో-ఆర్డినేటర్ తల్లెంభరత్ కుమార్‌రెడ్డి గజమాలతో ఘనంగా సన్మాంచారు. కార్యక్రమంలో తల్లెం విష్ణువర్ధన్‌రెడ్డి, దేసూరి వెంకటసుబ్బారెడ్డి, శ్రీకాంత్, నరసింహారాజు, కులయప్ప, కిరణ్, రాధా, మంగమ్మ, లతా, కమాల్‌బాషా, నరసమ్మ, మారతమ్మ, పద్మావతమ్మ, నాగరాజు పాల్గొన్నారు.

బోరుబావిని వేయిస్తున్న సర్పంచ్ రెడ్డిరామ్

గ్రామ పంచాయతీ నిధులతో బోరుబావి

ప్రజాశక్తి-కలికిరి

మండలంలోని మర్రికుంటపల్లి గ్రామపంచాయతీ గాజులబండ కురవపల్లిలో గ్రామపంచాయతీ నిధులతో బోరుబావిని వేస్తున్నట్లు సర్పంచ్ రెడ్డిరామ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని గత కొంతకాలంగా తాగునీరు సరఫరా తక్కువగా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారని అన్నారు. గ్రామపంచాయతీ నిధులతో బోరుబావుని వేసి తాగునీటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బోరుబావి వేయడం పట్ల గ్రామప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

క్రైం కార్నర్

కారు, బైక్ ఢీ: పలువురికి గాయాలు

-తృటిలో తప్పిన పెనుప్రమాదం

ప్రజాశక్తి-కలకడ

ప్రమాదంలో బోల్తా పడిన కారు

కారు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో పలువురికి గాయాలైన సంఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..వీరబల్లికి చెందిన రెడ్డప్పనాయుడు పక్షవాతంతో బాధపడు తుండటంతో పలమనేరులో పక్షవాతానికి మందు తీసుకోవడానికి కారులు బయలుదేరినట్లు తెలిపారు. ఈ క్రమంలో పోతువారిపల్లి వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు రోడ్డు ప్రక్కన బోల్తా పడినట్లు తెలిపారు. ఈఘటనలో పోతువారిపల్లికు చెందిన రాధాకృష్ణకు కాలికి బలమైన గాయం కావడంతో స్థానిక ప్రయివేట్ వైద్యశాలలు వైద్యం చేయించినట్లు తెలిపారు. కారులో ప్రయాణిస్తున్న నలుగురిని 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముగ్గురు పేకాట రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఆర్‌ఎం తండా సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న వెంటనే సిబ్బందితో దాడి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని, ఇద్దరు పరారీ అయ్యారని తెలిపారు. అరెస్టయి వారి నుంచి రూ.5,520 నగదును స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు.

నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని ఆర్‌ఎం తాండ సమీప గుట్టల్లో నాటుసారా తయారీ స్థావరాలపై శనివారం నాకాబందిలో భాగంగాదాడులు నిర్వహించినట్లు ఎస్ఐ తెలిపారు. పోలీస్ సిబ్బందితో నాటుసారా స్థావరాలను గుర్తించి తయారీకి ఉపయోగించే 600 లీటర్ల ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు. తయారీకి వినియోగించే ప్లాస్టిక్ డ్రమ్ములు, వస్తువులను తగలబెట్టినట్లు తెలిపారు.

నాటుసారా ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు